7

సాక్షి విశాఖపట్నం

సోమవారం । 26 । మే । 2025



రంగుల పడవలు కనువిందు

సాగర తీరం వెంబడి రంగురంగుల మత్స్యకారుల పడవలు సముద్రపు ఒడిలో తేలియాడుతూ కనువిందు చేశాయి. తెర చాపలు రెపరెపలాడుతుండగా, ఒకదాని వెనుక ఒకటి నెమ్మదిగా సాగిపోతూ పర్యాటకులకు, నగరవాసులకు అపురూప దృశ్యాన్ని ఆవిష్కరించాయి. ఆదివారం సాయంత్రం విశాఖ సాగర తీరంలో ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించి పలువురు పర్యాటకు తమ ఫోన్లలో వాటిని జ్ఞాపకాలుగా నిక్షిప్తం చేసుకున్నారు.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి కోరాడ సాయి సుదర్శన్. ఇతను విశాఖ సిటీలోని ఓ జనసేన ఎమ్మెల్యే అనుచరుడనని చెప్పుకుంటున్నాడు. లాసన్స్ బే కాలనీలో నివసిస్తున్న ఈ వ్యక్తి జీవీఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో తిరుగుతూ చికెన్ వ్యర్థాలను అనధికారికంగా సేకరిస్తున్నాడు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నవి జీవీఎంసీ పరిధిలోని షాపుల నుంచి అనధికారికంగా చికెన్ వ్యర్థాలను సేకరించి తూర్పు గోదావరికి తరలిస్తున్న వాహనాలు. ఈ వాహనాల గురించి పలువురు జీవీఎంసీ అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.



నేత.. వ్యర్థాల మేత

చికెన్ వ్యర్థాలతో చెడుగుడు



- రూ.కోట్లు కొల్లగొడుతున్న ఓ చోటానేత
- అనధికారికంగా సేకరిస్తున్న ఓ జనసేన ఎమ్మెల్యే అనుచరుడు
- ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- నెలవారీ మామూళ్లతో చెట్టాపట్టాలు
- పట్టుకున్న వాహనాలను వదిలేస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

విశాఖ చికెన్, మటన్ వ్యర్థాల అక్రమ తరలింపు జోరుగా సాగుతోంది. అక్రమంగా, అనుమతి లేకుండా జీవీఎంసీ పరిధిలో ఈ వ్యర్థాలను తరలిస్తున్నారంటూ ఫిర్యాదులు రావడంతో జీవీఎంసీ అధికారులు కొన్ని వాహనాలను పట్టుకున్నారు. అయితే, ఆశ్చర్యకరంగా ఈ వాహనాలను సీజ్ చేయకుండా, కేసు నమోదు చేయకుండా వదిలేసినట్లు తెలుస్తోంది. దీనికి కూటమి ఎమ్మెల్యే అండదండలే కారణమనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

కోరాడ సాయి సుదర్శన్‌పై ఆరోపణలు

విశాఖ సిటీలోని ఓ జనసేన ఎమ్మెల్యే అనుచరుడని చెప్పుకుంటున్న కోరాడ సాయి సుదర్శన్ ఈ వ్యవహారం వెనుక ఉన్నట్లు ఆరోపణలున్నాయి. లాసన్స్ బే కాలనీలో నివసించే సదరు వ్యక్తి, తన వెంట పది మంది యువకులను పెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతూ షాపుల నుంచి అనధికారికంగా చికెన్ వ్యర్థాలను సేకరిస్తున్నాడు. మూడు బొలెరో వాహనాల ద్వారా ఈ వ్యర్థాలను తూర్పు గోదావరి జిల్లాలోని రొయ్యల చెరువులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ విధంగా కోళ్ల వ్యర్థాలతో కోట్లు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం...!

జీవీఎంసీ పరిధిలో చికెన్ వ్యర్థాల అక్రమ తరలింపు దందా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. ఈ వ్యర్థాలను సేకరిస్తున్న ముఠా వాటిని అధిక ధరలకు చేపలు, రొయ్యల చెరువులకు తరలిస్తోంది. ఈ వ్యర్థాలను మేతగా వేయడం వల్ల చేపలు, రొయ్యలు త్వరగా బరువు పెరుగుతాయని, మేత ఖర్చు కూడా తగ్గుతుందని చెరువుల యజమానులు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. జీవీఎంసీ కేంద్రంగా సాగుతున్న ఈ వ్యవహారాన్ని అక్కడికక్కడే తొక్కేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ దందా జరుగుతున్నప్పటికీ, జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం, మత్స్యశాఖ, పోలీసుశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కాపులుప్పాడలో నిర్ణీత మొత్తంలో చికెన్ వ్యర్థాలు వస్తున్నాయా లేదా అని పరిశీలించాల్సిన అధికారులు కూడా ఇందులో భాగస్వామ్యమై తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నారని తెలుస్తోంది. చికెన్ వ్యర్థాలను తిన్న చేపలు, రొయ్యలను మనం తీసుకుంటే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. అధ్యయనాల ప్రకారం, ఇటువంటి వ్యర్థాలను తిన్న రొయ్యలు, చేపలను తినడం వల్ల కాలేయ, జీర్ణకోశ సమస్యలు, న్యూరో సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. అంతేకాకుండా, పేగులో పుండ్లు, మలబద్ధకం, పైల్స్ వంటి వ్యాధులు, ముఖ్యంగా మహిళల్లో నెలసరి సమస్యలతో పాటు క్యాన్సర్ వంటి రోగాలకు కూడా ఇది కారణమవుతుందని తేలింది. ఈ వ్యర్థాలను నిల్వ ఉంచే ప్రాంతంలో గాలిలో వైరస్ వ్యాపించి, ఆ గాలి పీల్చితే శ్వాసకోశ సంబంధ వ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లే ఈ వ్యవహారంపై ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

ఈ వ్యవహారంపై ఇప్పటికే పలు ఫిర్యాదులు ఉన్నప్పటికీ, జనసేన ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరిస్తుండటంతో అధికారులు మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ, ఈ వ్యర్థాలతో పెంచిన రొయ్యలు, చేపలను ప్రజలు తినడం ద్వారా అనేక రోగాల బారిన పడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. అయినప్పటికీ, జీవీఎంసీలోని ప్రజారోగ్య విభాగ అధికారులు ఈ చికెన్ వ్యర్థాల అక్రమ తరలింపును చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బెదిరిస్తూ.... బలవంతంగా!

విశాఖపట్నంలో చికెన్, మటన్ వ్యర్థాల అక్రమ తరలింపు వివాదాస్పదంగా మారింది. జీవీఎంసీ 8 జోన్లకు వ్యర్థాల సేకరణకు టెండర్లు కేటాయించినా, కూటమి నేతల పేరుతో కొందరు వ్యక్తులు అక్రమంగా వ్యర్థాలను సేకరిస్తున్నారు. జీవీఎంసీ పరిధిలోని షాపుల నుంచి వ్యర్థాలను సేకరించి కాపులుప్పాడకు తరలించాల్సి ఉండగా, వీరు తూర్పుగోదావరితో పాటు అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట, యలమంచిలి, మాడుగుల నియోజకవర్గాల్లోని చేపలు, రొయ్యల చెరువులకు తరలిస్తున్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు. పది మంది యువకులతో మూడు బొలెరో వాహనాల్లో బెదిరింపులకు పాల్పడుతూ వ్యర్థాలను సేకరిస్తున్నారని ఆరోపణలున్నాయి. జీవీఎంసీ ప్రజారోగ్య విభాగ అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ, జనసేన, టీడీపీ ఎమ్మెల్యేల పేర్లు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారని సమాచారం. జీవీఎంసీలోని ఓ అధికారికి నెలవారీగా భారీగా ముట్టచెబుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. చికెన్ వ్యర్థాలతో పెంచిన రొయ్యలు, చేపలు తినడం వల్ల అనేక రోగాలు వస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అయినప్పటికీ, ప్రజారోగ్య విభాగ అధికారులు ఈ అక్రమ తరలింపును చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి.



రాజకీయ కుట్రతోనే రేషన్ వెహికల్స్ రద్దు



నిరసన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, సీనియర్ నాయకులు తదితరులు

- చంద్రబాబువన్నీ డైవర్షన్ పాలిటిక్స్..
- 'ఎండీయూ' నిరసన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వం రాజకీయ కుట్రకోణంతోనే రేషన్ వాహనాల జీవోను రద్దు చేసిందని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆరోపించారు. ఎండీయూ వాహనాలను కొనసాగించి, తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎండీయూ డ్రైవర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్, ఎల్‌ఐసీ బిల్డింగ్ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ఆదివారం శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. వీరికి మద్దతుగా పాల్గొన్న కేకే రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రేషన్ డిపోల వద్ద గంటల తరబడి క్యూలో నిల్చుని, నానా ఇబ్బందులు పడుతున్న పేదల దుస్థితిని చూసే.. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే రేషన్ అందించాలని సరికొత్త వ్యవస్థను రూపొందించారని పేర్కొన్నారు. తద్వారా 20 వేల కుటుంబాలకు ఉపాధి కూడా చేకూరిందన్నారు. ఈ వ్యవస్థ ఎంత సమర్థవంతంగా పని చేసిందంటే.. దేశంలోని మిగతా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూడా దీన్ని అమలు చేసేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. ఈ సమయంలో, జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే దుగ్ధతో, కేవలం రాజకీయ కుట్రకోణంలో ఈ వ్యవస్థను రద్దు చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజలు కూటమి ప్రభుత్వంను అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ రేషన్ వెహికల్స్ ప్రజల్లో తిరిగితే గత వైఎస్సార్‌సీపీ సుపరిపాలన ప్రజలకు గుర్తుకు వస్తుందనే రద్దు చేశారన్నారు. ఈ వ్యవస్థ రద్దు ద్వారా సుమారు 20 వేల ఎండీయూ ఆపరేటర్స్, హెల్పర్ల కుటుంబాలతో పాటు కోటీ 50 లక్షల లబ్ధిదారులు ఇబ్బందులకు గురవడాన్ని వైఎస్సార్‌సీపీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబువన్నీ డైవర్షన్ పాలిటిక్స్ అని, ఎవరు మంచి చేసినా ఆయనకు నచ్చదన్నారు. ప్రధాని మోదీ పాకిస్తాన్ ఉగ్రవాదులపై చేసిన 'ఆపరేషన్ సిందూర్' మాదిరిగానే, ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీస్తున్న చంద్రబాబు పాలనపై 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇంటింటికీ రేషన్ అందించడం ద్వారా 1.5 కోట్ల మందికి ప్రయోజనం చేకూర్చారని, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడారని తెలిపారు. చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే ఈ పథకాలను రద్దు చేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. పవన్ కల్యాణ్ ఆధీనంలో ఉన్నప్పటికీ ఈ శాఖపై నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. హామీలు అమలు చేయడంలో విఫలమైన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు జగన్ చేసిన మంచి పనులను తొలగించడం అవివేకమన్నారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన ర్యాలీలో తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, కార్పొరేటర్ బిపిన్ జైన్, నాయకులు మార్కండేయులు, బి.పద్మావతి, ఆపరేటర్స్ అసోసియేషన్ నాయకులు ఎస్.బి.సతీష్, స్వామి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

టీటీ నూతన కార్యవర్గం

విశాఖ స్పోర్ట్స్: జిల్లా టేబుల్ టెన్నిస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా జేకే నాయక్, కార్యదర్శిగా కేవీఎం పాత్రో, కోశాధికారిగా పీవీ చలపతి ఎంపికైనట్టు ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉపాధ్యక్షులుగా సార్వభౌమ, షణ్ముఖరావు, సహాయ కార్యదర్శులుగా ప్రసాద్, శ్రీకాంత్‌లతో పాటు ఆరుగుర్ని సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



ఏవీఎన్ కాలేజీలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు



పరీక్షలు రాసి వచ్చి.. కుమార్తెను ఎత్తుకున్న తల్లి

మహారాణిపేట: జిల్లాలో ఆదివారం నిర్వహించిన యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ (యూపీఎస్సీ)సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్షల కోసం జిల్లా యంత్రాంగం పలు ఏర్పాట్లు చేసింది. మొత్తం 8,422 మంది విద్యార్థులకు కోసం 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి సెషన్ పరీక్షకు 8,422 మందిలో 4,523 మంది పరీక్షకు హాజరయ్యారు. రెండో సెషన్ పరీక్షకు(మధ్యాహ్నం) 8,422 మందికి 4.496 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం ఇద్దరు పరిశీలకులను నియమించారు. యూపీపీఎస్ నుంచి ఒక పరిశీలకుడుగా డైరెక్టర్ పట్నాయక్‌ను, రాష్ట్ర పరిశీలకులుగా సీనియర్ ఐఏఎస్ అధికారి అహ్మద్ బాబు, జిల్లా కో ఆర్డినేటర్ మయూర్ అశోక్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షల నేపథ్యంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్థానికంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి, ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కాలేజీ, అక్కయ్యపాలెం కేంద్రీయ విశ్వవిద్యాలయం కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయన వెంట రెవెన్యూ, పోలీస్, విద్యా శాఖల అధికారులున్నారు.

బీసీ బాలుర హాస్టల్ ప్రారంభం



హాస్టల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

పెదగంట్యాడ: విద్యా రంగ అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు సహకారం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేటలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు రూ. 97 లక్షలతో నిర్మించిన బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే విద్యా రంగంలో మరింత రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైజాగ్ స్టీల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రవీంద్రనాథ్, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, డీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చిక్కులు.. గురువులకు తిప్పలు

విశాఖ జిల్లా, గోపాలపట్నంలోని ఇందిరానగర్ స్కూల్ టీచర్‌కు స్టేషన్ సీనియార్టీ ఈ ఏడాది ఆగస్టుకు ఎనిమిదేళ్లు నిండుతాయి. కానీ, తప్పనిసరి బదిలీ జాబితాలో ఆమె పేరు చేర్చారు. సీనియార్టీ పాయింట్లు మాత్రం ఏడేళ్లకే ఇచ్చారు. దరఖాస్తు సమయంలో లీగల్లీ సెపరేట్‌కు 5 పాయింట్లు నమోదు చేసినా, ఫైనల్ జాబితాలో అవి యాడ్ కాలేదు. డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా.. సమస్యకు పరిష్కారం లభించలేదు.

విశాఖ నగరంలోని బుచ్చిరాజుపాలెంలో జీవీఎంసీ యూపీ స్కూల్‌ది మరో చిత్రం. ఇక్కడ స్థానికుల ఒత్తిడి మేరకు ఈ స్కూల్‌ను సమీప హైస్కూల్లో విలీనం చేయకుండా యూపీ స్కూల్‌గా కొనసాగిస్తున్నారు. ఇక్కడ 6, 7, 8 తరగతుల విద్యార్థులు 140 వరకు ఉన్నారు. ఒక్క స్కూల్ అసిస్టెంట్‌ను మాత్రమే ఇచ్చి, మిగతా పోస్టులు మిగులు టీచర్లు(సర్‌ప్లస్)గా చూపించారు. ఇక్కడ ఎస్జీటీలతో హైస్కూల్ పాఠాలు చెప్పిస్తారా? అని డౌట్..!

ఈ రెండు ఉదాహరణలు చాలు ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో గందరగోళం ఏ స్థాయిలో ఉందో తెలుసుకునేందుకు..!

- కొనసాగుతున్న బదిలీల గందరగోళం
- సర్వీస్ పాయింట్ల లెక్కతేలక అయోమయం
- సాంకేతిక సమస్యలతో దరఖాస్తుకు ఇబ్బందులు

విశాఖ విద్య: టీచర్ల బదిలీల్లో ఆన్‌లైన్ దరఖాస్తులు ఓ ప్రహసనంగా మారాయి. సర్వీసు పరమైన వివరాలు సవ్యంగా నమోదుకాక తీవ్రంగా నష్టపోతున్నారు. దరఖాస్తు సమయంలో వెబ్‌సైట్‌లో చూపిస్తున్న వివరాలకు భిన్నంగా ఫైనల్ జాబితాలో చూపిస్తుండటంతో ఏ మారుమూలకు కొట్టుకుపోతామోనని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

ఖాళీలపై స్పష్టతేదీ?

బదిలీల నేపథ్యంలో క్లియర్ వేకెన్సీ, 5/8 లాంగ్‌స్టాండింగ్ వేకెన్సీల ప్రకటనలో జిల్లా విద్యాశాఖ నుంచి ఇప్పటికీ స్పష్టత లేదు. తొలుత 4,788 ఖాళీలు ప్రకటించారు. ఆ తర్వాత 4,811గా బయటకు లీకులిచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మళ్లీ దీనిపై కసరత్తు చేశారు. ఇదంతా తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది

యూపీ స్కూళ్లలో పోస్టులు మాయం

ప్రాథమికోన్నత(యూపీ) పాఠశాలల్లో పోస్టుల కోతను ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల కోరిక మేరకు, డిమాండ్ ఉన్న చోట యూపీ స్కూళ్లను కొనసాగిస్తున్నట్లు చెప్పిన కూటమి ప్రభుత్వం, లోపాయికారీగా వాటిని నిర్వీర్యం చేస్తోంది. కొత్తగా జిల్లా విద్యాశాఖ చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియ ఈ అనుమానాలకు బలం చేకూర్చుతోంది.

మోడల్ స్కూల్ హెచ్‌ఎంలు ఎవరో..?

ఉమ్మడి విశాఖ జిల్లాలో 565 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా మిగిలిన 277 మంది స్కూల్ అసిస్టెంట్లను వీటికి హెచ్‌ఎంలుగా నియమిస్తామని తొలుత ప్రకటించారు. కానీ, బదిలీల సమయంలో దీనిపై స్పష్టత లేకపోవటంతో అంతా అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ల బదిలీ దరఖాస్తుకు ఆదివారంతో గడువు ముగిసింది. త్వరలోనే వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలి. దీనిపై ఇప్పటి వరకు స్పష్టత లేకపోవటంతో సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాబితాల తయారీకి తలనొప్పులు

బదిలీల నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు వెబెక్స్ సమీక్షల పేరుతో రోజుకో ఆదేశం ఇస్తున్నారు. ఆ మేరకు సీనియార్టీ జాబితాలను తయారు చేసేందుకు జిల్లా విద్యాశాఖ సిబ్బంది తర్జనభర్జనలు పడుతున్నారు. క్షణానికో ఉత్తర్వుతో కేడర్ల వారీగా జాబితాల నమోదులో జాప్యం నెలకొంటోంది. దీంతో సాంకేతిక సమస్యల పరిష్కారం పేరిట నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. దీని వల్లనైనా తమ ఇబ్బందులు పరిష్కరిస్తే చాలని గురువులు కోరుకుంటున్నారు.



విశాఖలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

ఉత్సాహంగా యోగాంధ్ర



యోగాసనాలు వేస్తున్న నగరవాసులు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహకంలో భాగంగా నిర్వహిస్తున్న నెలరోజుల కార్యక్రమాలు ఆదివారం కూడా కొనసాగాయి. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా పతంజలి సంస్థ ఆధ్వర్యంలో యోగా సాధన కార్యక్రమం జరిగింది. వేదికపై నుంచి శిక్షకుల పర్యవేక్షణలో నగరవాసులు యోగాసనాలు వేశారు. జూన్ 21న విశాఖ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అందుకు తగిన ఏర్పాట్లు చేస్తోంది.

67 మంది కళాకారులకు ఘన సత్కారం



సత్కారం పొందిన 67మంది సంగీత కళాకారులతో వీఎండీఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఆల్ ఇండియా రేడియో ద్వారా గుర్తింపు పొందిన 67 మంది బి–హైగ్రేడ్ కళాకారులను విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సత్కరించారు. అకాడమీ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్. రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్‌ల చేతుల మీదుగా ఈ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా సంగీతం, సాహిత్యం, నృత్యం, నాటకం, హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, జానపద, సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తూ కళాకారులను విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రోత్సహిస్తుందని తెలిపారు. త్వరలో సన్మానం పొందిన కళాకారులతో వంకాయల వెంకటరమణ మృదంగం గ్లోబల్ ఆర్టిస్ట్ ఆధ్వర్యంలో సన్నాయిలు, డోళ్లతో లయ విన్యాస కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమం అనంతరం ప్రముఖ గాత్ర విద్వాంసులు డాక్టర్ ద్వారం త్యాగరాజు బృందం అద్భుతమైన గాత్రకచేరి నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పంతులు గోపాలరావు, శారదా సుబ్రహ్మణ్యం కూడా పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక ఊర్వశి కూడలిలోని గౌరీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్‌రావు, కరస్పాండెంట్ పి.ఎస్. నాయుడు ఆదివారం తెలిపారు. స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా జరగనుంది. మొత్తం 12 కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని సుమారు 1840 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. టెన్త్ నుంచి డిగ్రీ, ఐటీఐ, బీ.టెక్, ఫార్మసీ (డీ, బీ, ఎం) పూర్తిచేసిన అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో సోమవారం ఉదయం 9 గంటల నుంచి కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని నిర్వాహకులు సూచించారు.

శభాష్ పోలీస్



విశాఖ బీచ్ రోడ్డులో ఆదివారం సాయంత్రం ఒక దృశ్యం చూపరులకు ఆహ్లాదం కలిగించింది. ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమించే పోలీసులు, తమ కఠిన విధుల్లోనూ మానవతా హృదయాన్ని చాటారు. రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్న ఒక దివ్యాంగుడిని గమనించిన అక్కడ విధుల్లో ఉన్న ఒక మహిళా కానిస్టేబుల్ వెంటనే సహాయం అందించారు. వాహనాలను ఆపి, ఆ దివ్యాంగుడు సురక్షితంగా రోడ్డు దాటే వరకు అక్కడే ఉండి తోడుగా నిలిచారు. పోలీసులు కేవలం చట్టాన్ని అమలు చేసేవారే కాదు, సమాజంలో కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచే మానవతావాదులు అని ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది. ఈ స్ఫూర్తిదాయక దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా

నేడు 'ఉక్కు' చర్చలు

ఉక్కునగరం: కేంద్ర కార్మిక శాఖ రీజనల్ లేబర్ కమిషనర్(ఆర్ఎల్సీ) సోమవారం స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు, ఉక్కు యాజమాన్యం, కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 16న జరిగిన చర్చలు విఫలం కావడంతో సమావేశాన్ని వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 20 నుంచి స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుండటంతో ఈ చర్చలు కీలకంగా మారనున్నాయి. ఈ సమావేశంలో యాజమాన్యం తీసుకునే నిర్ణయంపై అంతటా ఆసక్తి నెలకొంది.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి



సమీర్ మృతదేహం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్‌లో ఆదివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లిన సమీర్(26) నీటిలో మునిగి చనిపోయాడు. మారికవలసకు చెందిన సమీర్‌కు ఈత రాదు. అయితే ఐదుగురు వ్యక్తులతో కలిసి రిజర్వాయర్‌లో దిగిన సమీర్ ఈ ప్రమాదానికి గురయ్యాడు. ఎన్డీఆర్ఎఫ్ బృందంతో పాటు తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమీర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రాస్ రూట్స్ ఫుట్‌బాల్ డే విజేత శ్రీకాకుళం



విజేత జట్టుతో నిర్వాహకులు

తగరపువలస: మధురవాడలోని శాప్ గ్రౌండ్‌లో ఈ నెల 23న గ్రాస్ రూట్స్ డే సందర్భంగా నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్-2025లో శ్రీకాకుళం ఫుట్‌బాల్ క్లబ్ జట్టు విజేతగా నిలిచింది. అండర్ బాయ్స్ జట్టు రన్నరప్ సాధించింది. ఉత్తరాంధ్ర జోనల్ అండర్-14 బాయ్స్ అండ్ గర్ల్స్ టోర్నమెంట్‌లో మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ఆదివారం ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీవో జూన్ గాలియట్, లోసో సుష్మిత, రాకేష్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ నరసింహారెడ్డి, జిల్లా ఒలింపిక్స్ ఎగ్జిక్యూటివ్ శరత్, వీడీఎఫ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఎస్‌జీ రామకృష్ణ, స్టార్ ఫెక్స్ సన్నిబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.105
బ్రాయిలర్ (లైవ్)	: రూ.125
స్కిన్	: రూ.220
స్కిన్‌లెస్	: రూ.230

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	525.00
విజయనగరం	529.00
శ్రీకాకుళం	529.00

డిగ్రీ కాలేజీల్లో తనిఖీలెప్పుడో.!

విశాఖ జిల్లా ఎన్ఏడీ సెంటర్‌లోని ఓ డిగ్రీ కళాశాల పైఅంతస్తులో రేకుల షెడ్డు వేసి తరగతులు నిర్వహిస్తున్నారు. గాలి, వెలుతురు సరిగా లేవు. కళాశాలలో సరైన వసతులు లేవు. ఇరుకు గదుల్లో పాఠాలు బోధిస్తున్నారు. సైన్సు గ్రూప్ విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు సరైన ప్రయోగశాలలు కూడా లేవు. కానీ ఆంధ్ర విశ్వవిద్యాలయ అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు.

విశాఖ నగరంలోని ద్వారకానగర్‌లో బీబీఏ, బీసీఏ కోర్సుల పేరుతో కళాశాల నిర్వహిస్తున్నప్పటికీ, ఇక్కడి విద్యార్థులకు వేరే కళాశాలలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే, అకాడమీల పేరుతో దర్జాగా కళాశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారు.

అనకాపల్లి జిల్లా పరవాడలోని ఓ కళాశాలలో ఒడిశాకు చెందిన విద్యార్థులను ఎక్కువగా చేర్పించుకుంటున్నారు. కేవలం పరీక్షలప్పుడే ఈ కళాశాల విద్యార్థులతో కళకళలాడుతోంది. ఇక్కడ విజిటింగ్ అధ్యాపకులతోనే కళాశాల నిర్వహిస్తున్నారనే ప్రచారం ఉంది. ఇవే కాదు.. ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సగానికి పైగా డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు నిర్వహించే కళాశాలలు ఇదే తీరుగా కొనసాగుతున్నాయి.

- ఉన్నత చదువులపై పర్యవేక్షణ కరువు
- నిబంధనలకు విరుద్ధంగా కళాశాలల నిర్వహణ
- ఎఫిలియేషన్ పేరిట ప్రైవేట్ కాలేజీల నుంచి వసూళ్లు?

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల ఆధ్వర్యంలో 196 డిగ్రీ, పీజీ కళాశాలలున్నాయి. వీటి పరిధిలో ఏటా సుమారు 25 వేలకు పైగా విద్యార్థులు వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి కళాశాలల నిర్వహణకు అనుమతులు ఇచ్చేందుకు ఉన్నత విద్యామండలి సిద్ధమవుతోంది. విశ్వవిద్యాలయంలోని కాలేజీ డెవలప్‌మెంట్ కమిటీ (సీడీసీ) ఈ మొత్తం వ్యవహారాలను చూస్తోంది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్‌లతో ఈ నెల 28న ఉన్నత విద్యామండలి పెద్దలు సమావేశం ఏర్పాటు చేసినందున.. వచ్చే విద్యా సంవత్సరం ప్రవేశాలపై దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఏయూ అధికారులు విశ్వవిద్యాలయ క్యాంపస్ కళాశాలలతో పాటు అనుబంధ కళాశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నారు.

కళాశాలల నిర్వహణకు ఇవి ఉండాల్సిందే..

డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఆరు వేలు, పట్టణ ప్రాంతాల్లో ఎనిమిది వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన పక్కా భవనాలు ఉండాలి. విద్యార్థుల సంఖ్య, నిర్వహించే కోర్సులకు అనుగుణంగా తరగతి గదులు, గ్రంథాలయం, కార్యాలయ గది, స్టాఫ్ రూం, బాలికలకు వెయిటింగ్ రూం, సరిపడా మరుగుదొడ్లు, సైన్సు ప్రయోగాలకు అనువైన ప్రయోగశాలలు ఉండాలి. విద్యార్థులు ఆడుకునేందుకు మైదానం, పార్కింగ్ ప్రదేశం, అర్హత గల అధ్యాపకులు ఉండాలి. కళాశాలల నిర్వాహకులు వీటన్నింటికీ సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ప్రవేశాల నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే ఉన్నత విద్యా మండలి రూపొందించిన పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

పరిశీలనకు నిజ నిర్ధారణ కమిటీలు

కళాశాల యాజమాన్యాలు పొందుపరిచిన వివరాల మేరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి నియమించిన నిజ నిర్ధారణ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి ఇచ్చిన నివేదిక మేరకు రిజిస్ట్రార్ ధ్రువీకరించి, దానిని వైస్ చాన్సలర్‌కు నివేదిస్తారు. అన్నీ సక్రమంగా ఉన్న కళాశాలల జాబితాను ప్రవేశాల వెబ్‌సైట్‌లో పెట్టేందుకు ఉన్నత విద్యామండలికి పంపిస్తారు. ప్రైవేటు కళాశాలలను కట్టడిచేసే క్రమంలో గత ప్రభుత్వం ప్రవేశాలలో ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చింది. ఇదే రీతిలో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాల ప్రక్రియకు ఉన్నత విద్యామండలి ఏర్పాట్లు చేస్తోంది.



ఏయూలోని సీడీసీ విభాగం

ప్రైవేటు కళాశాలల లాబీయింగ్?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రైవేటు కళాశాలల నిర్వాహకులకు రెక్కలొచ్చాయి. మౌలిక వసతులు, అర్హత గల అధ్యాపకులు లేకున్నా విశ్వవిద్యాలయం నుంచి అనుమతులు పొందేందుకు అప్పుడే లాబీయింగ్ బృందం సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది. అడిగినంత ఇస్తే, విశ్వవిద్యాలయం నుంచి అఫిలియేషన్ వచ్చేలా తాము చూసుకుంటామని కూటమి నేతలతో అంటకాగే విశ్వవిద్యాలయంలోని ఓ వర్గం వసూళ్లకు తెరలేపినట్లు తెలుస్తోంది.

నేటి నుంచి మీజిల్స్, రుబెల్లా టీకాల ప్రత్యేక డ్రైవ్

మహారాణిపేట: జిల్లాలో మీజిల్స్, రుబెల్లా వంటి ప్రమాదకరమైన వైరల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సోమవారం నుంచి ప్రత్యేక టీకాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మూడు నెలల పాటు కొనసాగే ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో వచ్చే న్యుమోనియా, విరేచనాలు, మెదడు వాపు వంటి తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. రుబెల్లా వైరస్ గర్భిణులకు సోకితే పుట్టబోయే పిల్లల్లో చెవుడు, చూపు లోపం, గుండె సంబంధిత లోపాలు వంటి జన్యుపరమైన సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధుల నుంచి పిల్లలను రక్షించడానికి భారత ప్రభుత్వం యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం కింద రెండు డోసుల టీకాలను అందిస్తోంది. మొదటి డోసు 9 నుంచి 12 నెలల మధ్య, రెండవ డోసు 16 నుంచి 24 నెలల మధ్య వేయాల్సి ఉంటుంది. 2026 నాటికి మీజిల్స్, రుబెల్లాను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ప్రత్యేక టీకాల డ్రైవ్ మూడు రౌండ్లలో కొనసాగుతుంది. మొదటి రౌండ్ ఈ నెల 26 నుంచి 31 వరకు, రెండవ రౌండ్ జూన్ 23 నుంచి 28 వరకు, మూడవ రౌండ్ జూలై 21 నుంచి 26 వరకు కొనసాగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బి.లూసీ కార్డిలియా తెలిపారు. ప్రతి ఒక్క బిడ్డకు టీకాలు వేయడం ద్వారా 2026 నాటికి మీజిల్స్,రుబెల్లా నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోగలమని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. విస్తృత ప్రచారం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులు



వైద్య విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందిస్తున్న అతిథులు

బీచ్‌రోడ్డు: జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులని, వారి వల్లే ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం లభిస్తోందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. వైజాగ్ మీడియా అవార్డ్స్, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, భవిష్యత్తులో అపారమైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఎస్.ధనుంజయరావు మాట్లాడుతూ నేటి విద్యార్థులు రేపటి ఆశాకిరణాలని, ఉన్నత విద్యతో వారు కోరుకున్న ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. అవార్డు, ఉపకారవేతనాల నిర్వాహక కమిటీ చైర్మన్ గంట్ల శ్రీనుబాబు, చీఫ్ ఆర్గనైజర్ ఆర్.నాగరాజు పట్నాయక్ మాట్లాడుతూ ఎంబీఏ, ఎంబీబీఎస్, ఎంఎల్, బీఎల్, నర్సింగ్, ఇంజినీరింగ్ చదువుతున్న 33 మందికి, క్రీడలు, సంగీతం వంటి విభాగాల్లో 11 మందికి ప్రతిభా పురస్కారాలను అందజేసినట్లు తెలిపారు. ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు అత్యధిక మార్కులు సాధించిన 126 మంది జర్నలిస్టుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశామన్నారు. ప్రముఖ సంఘ సేవకుడు కమల్ బెయిద్, బెహరా భాస్కరరావు, స్థిత ప్రజ్ఞ ఫౌండేషన్ చైర్మన్ వై.వి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంటి క్యాన్సర్‌పై అవగాహన అవసరం



వైటాథాన్‌లో పాల్గొన్న వైద్యులు, నగరవాసులు

ఏయూక్యాంపస్: కంటి క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ఎల్.వి ప్రసాద్ నేత్ర వైద్య శాల ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ఆదివారం వైటాథాన్ కార్యక్రమం జరిగింది. ముందుగా ఆర్.కె బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్ ముఖ్య వైద్యుడు డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ రెటినోబ్లాస్టోమా(కంటి క్యాన్సర్) లక్షణాలను వివరించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా సమాచారం పొందిన వ్యక్తులు.. ఆ వివరాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. తద్వారా కంటి దృష్టిని, ప్రాణాన్ని కాపాడటం సాధ్యపడుతుందన్నారు. పిల్లల కంటిలో తెల్లని ప్రతిబింబం కనిపించిన వెంటనే నిపుణులను సంప్రదించాలని సూచించారు. వైటాథాన్ ద్వారా సేకరించిన నిధులను ఆర్థికంగా వెనుకబడిన పిల్లల్లో రెటినోబ్లాస్టోమా చికిత్సను ఉపయోగిస్తామని తెలిపారు. మూడేళ్ల కంటే తక్కువ వయసు ఉన్న చిన్నారులను ఎక్కువగా ప్రభావితం చేసే కంటి వ్యాధి రెటినోబ్లాస్టోమా అని అన్నారు. మెల్లకన్ను, ఎరుపెక్కిన కళ్లు, వాచిన కనురెప్పలు, ఉబ్బిన కళ్లు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, నగరవాసులు పాల్గొన్నారు. ముందుగా కాళీమాత ఆలయం వద్ద కంటి క్యాన్సర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

జయహో భారత్



ర్యాలీలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

ఏయూ క్యాంపస్: భారత త్రివిధ దళాల శక్తిని కీర్తిస్తూ ఆదివారం బీచ్‌రోడ్డులో టార్చ్ లైట్ ర్యాలీ జరిగింది. ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ విశాఖ కేంద్రం ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్‌పై భారత త్రివిధ దళాల సైనికుల వీరోచిత పోరాటాన్ని కీర్తిస్తూ వేదికపై నృత్య రూపకాలు ప్రదర్శించారు. ఆ తర్వాత టార్చ్ లైట్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్ కుమార్, కార్యదర్శి షరీష్ ఖాన్, ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్ మోహన్, వైజాగ్ హోటల్స్ అసోసియేషన్ కార్యదర్శి పవన్ కార్తీక్, ఈవెంట్ మేనేజర్లు మీనాక్షి అనంత రామన్, అజయ్ అగర్వాల్, దాడి రవికుమార్, ఎస్.ఆర్.కె.బాబూరావు, జయచంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.



బెలూన్లను ఎగురవేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అదిరేటి డ్రెస్ మేమేస్తే..





ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్ద అందుబాటులో ఉన్న గిరిజన సంప్రదాయ వస్త్రధారణకు పర్యాటకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇక్కడ స్థానిక మహిళలు గిరిజనులు ధరించే చీరలు, ఇతర అలంకరణ సామగ్రిని అద్దెకు ఇస్తున్నారు. ఆదివారం ఇక్కడికి వచ్చిన పర్యాటకులు వీటితో అలంకరించుకుని మురిసిపోయారు. ఫొటోలు దిగుతూ సందడి చేశారు. గిరి మహిళలతో థింసా నృత్యం చేస్తూ ఆనందించారు. - డుంబ్రిగుడ

సేంద్రియ మామిడి మేళాకు స్పందన



మేళాలో మామిడి పండ్లను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని బీవీకే జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన రెండో విడత సేంద్రియ మామిడి పండ్ల మేళా విజయవంతంగా ముగిసింది. గత వారం రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ మేళాకు విశేషమైన స్పందన రావడంతో.. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధులు రెండో విడతగా శని, ఆదివారాల్లో మళ్లీ మేళా ఏర్పాటు చేశారు. ఈ మేళాలో రసాయనాలు వాడకుండా సహజ పద్ధతుల్లో పండించిన వివిధ రకాల మామిడి పండ్లను ప్రదర్శించారు. విశాలాక్షినగర్‌తో పాటు నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి మామిడి పండ్లను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి చవ్వాకుల అశోక్ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో పండించిన మామిడి పండ్లను ఈ మేళాలో విక్రయించడానికి రైతులు ముందుకు రావడం, వినియోగదారులు వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం సంతోషంగా ఉందన్నారు. ఈ మేళాలో పంచదార కలిశాలు, కొత్తపల్లి కొబ్బరి, పండూరి మామిడి, స్వాగతం, అమృతం, పాపారాజు గోవా, బంగినపల్లి, సువర్ణరేఖ, చిన్న రసాలు, కొబ్బరి అంటు, ముంత మామిడి, నాగులపల్లి రసాలు, హైదర్ సాయిబు, జహంగీర్ పెద్ద రసాలు, ఇమామ్ పసందు వంటి అనేక రకాల మామిడి పండ్లను రైతులు విక్రయించారు.

నాణెం.. చరిత్రకు సాక్ష్యం



20 పైసల ఇత్తడి నాణేలు



రెండు రకాల లోహాల10 పైసల నాణేలు



భారతీయ కరెన్సీ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలసకు చెందిన రంగూరి గిరిధర్ ఇంట కాలచక్రంలో కరిగిపోని ఓ అపురూప నిధి ఉంది. అది బంగారం, వజ్రాలు కాదు.. వందలాది పాతకాలపు నాణేలు, పదుల సంఖ్యలో అప్పటి కరెన్సీ నోట్లు! అవును.. ఇవి చరిత్రకు సజీవ సాక్ష్యాలు. గిరిధర్ వద్ద భద్రంగా ఉన్న ఈ నాణేలన్నీ ఒకప్పటి మన జీవన విధానానికి, ఆర్థిక వ్యవస్థకు అద్దం పడతాయి. వీటిలో అణా, ఒక పైసా, రెండు పైసలు, మూడు పైసలు, ఐదు పైసలు, ఇరవై, ఇరవై ఐదు, యాభై పైసల నాణేలున్నాయి. ఆనాటి అవసరాలకు అనుగుణంగా అల్యూమినియం, ఇత్తడి, కంచు వంటి లోహాలతో తయారైన ఈ నాణేలు చూడటానికి చిన్నవే అయినా.. అవి మోసుకొచ్చిన చరిత్ర ఆసక్తికరం. ఈ నాణేలు ఇప్పుడు చలామణిలో లేకపోవచ్చు. కానీ వాటి విలువ ఏమాత్రం తగ్గలేదని గిరిధర్ చెబుతున్నారు. నిజమే.. వీటి చారిత్రక, సాంస్కృతిక విలువ వెలకట్టలేనిది. పూర్వం చాలా మంది ఇలాంటి పాత నాణేలను ఇచ్చి వెండి వస్తువులు కొనుగోలు చేసేవారని, ఆ లెక్కన చూసుకున్నా ఇప్పటికీ ఈ లోహపు నాణేలకు విలువ ఉంటుందని కొందరు అంటుంటారు. కానీ గిరిధర్ కుటుంబానికి మాత్రం ఈ నాణేలను అలా మార్చుకోవడం ఇష్టం లేదు. వీటిని చూస్తూ మురిసిపోతుంటుంది.



అణా, 20, 25, 50 పైసల నాణేలు

నాణేల వెనుక కథలు..

ఈ నాణేల వెనుక ఉన్న కథలను, అప్పటి వాటి కొనుగోలు శక్తిని తన తల్లిదండ్రులు అరుణకుమారి, ప్రసాదరావు వివరిస్తుండేవారని గిరిధర్ చెబుతున్నారు. ఒక అణాతో ఏమేమి కొనుగోల చేశాం? ఒక పైసా విలువ ఎలా ఉండేది? వంటి విషయాలు వారి మాటల్లో వింటుంటే ఆ కాలంలోకే వెళ్లినట్లు అనిపించేదని గుర్తు చేసుకుంటారు. ఇప్పుడు గిరిధర్ కూడా తన తర్వాతి తరాలకు ఈ నాణేలను చూపిస్తూ.. వాటి గొప్పతనాన్ని, మన పూర్వీకుల జీవన విధానాన్ని వివరిస్తున్నారు. ఈ నాణేల చప్పుడులో ఒకప్పటి చరిత్ర ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.

నాన్న జ్ఞాపకం ఈ నాణేలు



మా నాన్న ప్రసాదరావు భీమిలి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్. ఆయనకు స్వదేశీ, విదేశీ నాణేలు సేకరించడం హాబీగా ఉండేది. బ్రిటిష్ ప్రభుత్వం, రాజుల పాలనతో నాణేలు కూడా ఉండేవి. పదేళ్ల కిందట ఆయన మరణించడం, ఇల్లు మారడంలో చాలా వరకు నాణేలు కనిపించకుండా పోయాయి. ఇప్పుడు ఉన్న విలువైన వీటిని పదిలం చేసుకున్నాం.

– రంగూరి గిరిధర్, చిట్టివలస

ఏనుగమ్మా.. ఏనుగు



పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకర్షించే ఏనుగు ఊరేగింపుగా వెళ్తోంది. అయితే ఇది నిజమైన ఏనుగు కాదు.! కళాకారుల నైపుణ్యానికి అద్దం పట్టేలా వెదురుతో చేసిన ఏనుగు! నగరంలోని ఓ గ్రామ దేవత పండగ కోసం సిద్ధం చేసిన ఈ వెదురు ఏనుగును 'ఏనుగమ్మా.. ఏనుగు..' అంటూ ఆదివారం పండగ కమిటీ సభ్యులు తీసుకువెళ్లారు. ఈ దృశ్యం చూపరుల మనసు దోచుకుంది. వెదురు బద్దలు ఉపయోగించి.. ఎంతో ఓర్పుతో.. కళాత్మక దృష్టితో ఈ ఏనుగు నమూనాను రూపొందించడం విశేషం. ఇది కళాకారుల సృజనాత్మకతకు, వారి అంకిత భావానికి నిదర్శనం.

-ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సైనిక్ స్కూల్‌కు తగరపువలస విద్యార్థి ఎంపిక



దినేష్

తగరపువలస: కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 9వ తరగతిలో ప్రవేశానికి ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షలో జోగావారి వీధికి చెందిన తెడ్లాపు దినేష్ ఎంపికయ్యాడు. ఈ పరీక్షలో 400 మార్కులకు గాను దినేష్ 370 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 108వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం భీమిలి ఐఎన్ఎస్ కళింగలో దినేష్ 8వ తరగతి పూర్తి చేశాడు. తల్లిదండ్రులు నరేంద్రకుమార్, లక్ష్మీదేవి మాట్లాడుతూ చెన్నైలోని నేషనల్ డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ఆన్‌లైన్‌లో దినేష్‌కు కోచింగ్ ఇప్పించినట్టు తెలిపారు.

సీన్ అదుర్స్





విశాఖపట్నం తీరం ఆదివారం జనసందోహంతో కళకళలాడింది. నగరం నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాయంత్రం వేళ ఆర్.కె. బీచ్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సముద్రపు అలల సవ్వడులు, పిల్లల కేరింతలు, కుటుంబ సభ్యులు, స్నేహితుల ముచ్చట్లతో బీచ్ అంతా సందడిగా మారింది. వారపు అలసటను తీర్చుకోవడానికి, స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ సేద తీరడానికి సాగర తీరం ఎప్పుడూ అనువైన వేదిక అని మరోసారి రుజువైంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో సందర్శకులు ఆనందంగా గడిపారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ అపురూప క్షణాలను పదిలపరుచుకున్నారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం